బొగ్గు దందా.. ఆగేదేలే

☛ ఉమ్మడి జిల్లాలో విచ్చలవిడిగా వ్యాపారం

న్యూస్‌టుడే, కామారెడ్డి నేరవిభాగం

పెద్ద కలప చెట్లను కొట్టి.. బట్టీలో పేర్చి బొగ్గుగా మార్చే అక్రమ వ్యాపారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జోరుగా సాగుతోంది. ఇక్కడ తయారవుతున్న బొగ్గును వివిధ ప్రాంతాలకు తరలిస్తూ కొందరు సొమ్ము చేసుకుంటున్నారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో కలప బొగ్గు తయారీ, అమ్మకాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది.



కామారెడ్డి జిల్లాలో అమ్మకానికి సిద్ధం చేసిన కలప బొగ్గు

తయారీ ఎక్కడంటే..

కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట, పాల్వంచ, మాచారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, బీబీపేట, రామారెడ్డి, సదాశివనగర్, గాంధారి మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని రెంజల్, ఇందల్వాయి, డిచ్‌పల్లి, ఎడపల్లి, నవీపేట, కోటగిరి తదితర మండలాల పరిధిలోని రహస్య ప్రాంతాల్లో కలప బొగ్గు తయారీ బట్టీలను నిర్వహిస్తున్నారు. ఎప్పుడూ ఒకే చోట కాకుండా వాటిని తరచూ మారుస్తున్నారు. అధిక కలపనిచ్చే చింత, మామిడి, ఇప్ప, వేప, కానుగ, మద్ది చెట్లు లభించినచోట.. రహస్య ప్రాంతాల్లో కలప బొగ్గు తయారీ బట్టీని పెట్టేస్తున్నారు.

సమాచారం బయటకు పొక్కకుండా..

అక్రమ బొగ్గు దందా వ్యాపారం గుట్టు బయటకు పొక్కకుండా ఉండేందుకు వ్యాపారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. స్థానికులను కాకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ, ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తెప్పిస్తున్నారు. ఊరికి దూరంగా అటవీ ప్రాంతాలకు సరిహద్దుల్లో రహస్యంగా స్థావరాలు ఏర్పరిచి సదరు కూలీలతో దందాను నిర్వహిస్తున్నారు. తయారైన బొగ్గును ఎక్కడికి తరలిస్తున్నారు.. ఎంత ధరకు అమ్ముకుంటున్నారనేది గుట్టుగా ఉంచుతున్నారు. దీంతో వ్యాపారులు రూ.కోట్లకు పడగలెత్తుతూ.. పచ్చదనానికి తూట్లు పొడుస్తున్నారు. కామారెడ్డి జిల్లాలోని రామారెడ్డి, పాల్వంచ మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలంలో కలప బొగ్గు అక్రమ వ్యాపారులపై అధికారులు ఇటీవల కేసులు నమోదు చేశారు.

ఎవరికి విక్రయిస్తున్నారంటే..?

వ్యాపారులు కలప బొగ్గు తయారీకి ముందే.. దాన్ని వినియోగించే వారి వివరాలు సేకరించి, కొనుగోళ్లపై ఆర్డర్లు తీసుకుంటున్నారు. వారి అవసరాల మేరకు కలప బొగ్గును సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా బీడీ కంపెనీలు, ఇటుక బట్టీలు, ఇనుప వస్తువుల తయారీదారులు, ఇస్త్రీ చేసే వారు ఈ కలప బొగ్గును పెద్దఎత్తున వినియోగిస్తుంటారు. వీరికి టన్నుకు రూ.30-50 వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. రాత్రి పూట బొగ్గును సరఫరా చేస్తున్నట్లు సమాచారం.

అంచు.. ముంచు



కామారెడ్డి జిల్లా కేంద్రంలో పెద్ద చెరువు నీటి శుద్ధి కేంద్రం వద్ద రోడ్డు అంచు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు. సమస్య చిత్రాన్ని న్యూస్‌టుడే ఆదివారం క్లిక్‌మనిపించింది. – న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

అల్లంత దూరాన.. ఆధార్ కేంద్రం

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, బ్యాంకింగ్ సేవలు, విద్యా సంబంధిత అవసరాలకు ఆధార్ కీలకంగా మారింది. తాజాగా రేషన్‌కార్డుల్లో కేవైసీకి ఆధార్ అవసరమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని కొన్ని మండలవాసులు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవడానికి నానాకష్టాలు పడుతున్నారు. చిన్నారులతో కలిసి దూరప్రాంతాల్లోని ఆధార్ కేంద్రాలకు వెళ్తున్నారు. ప్రజల వెతలపై కథనం.

25 కిలోమీటర్ల ప్రయాణం

బిచ్కుంద పట్టణంలో గతంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసిన వ్యక్తి మోసానికి పాల్పడినట్లు అధికారులు గుర్తించి కేంద్రాన్ని నిలిపివేశారు. దీంతో రెండేళ్లుగా ఆధార్ కేంద్రం లేక పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బిచ్కుంద పట్టణవాసులు మద్నూర్, పెద్దకొడప్‌గల్, బాన్సువాడ, బోధన్, కామారెడ్డికి వెళ్లి ఆధార్ తీసుకోవాల్సిన పరిస్థితి. ఆధార్ కోసం సుమారు 25 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి వస్తోంది. - న్యూస్‌టుడే, బిచ్కుంద

రోజంతా పూర్తిగా కేటాయింపు

నాగిరెడ్డిపేట్ మండలకేంద్రంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు ఎల్లారెడ్డి, మెదక్ పట్టణాలకు వెళ్తున్నారు. పిల్లలు, వృద్ధుల ఆధార్‌లో మొబైల్ నంబరు, పుట్టిన తేదీ, ఇంటిపేరు మార్పు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆధార్ కోసం ఒక రోజు పూర్తిగా కేటాయించాల్సి వస్తోందని.. ఇతర పనిని వదులుకోవాల్సి వస్తోందని మండలవాసులు వాపోతున్నారు. ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నాగిరెడ్డిపేట్

పక్క జిల్లాకు వెళ్లాల్సిందే..

కొత్తగా ఏర్పడిన పాల్వంచ మండలకేంద్రంలో ఆధార్ సెంటర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా కార్డు కోసం, మార్పులుచేర్పులకు పాల్వంచ మండలంలోని గ్రామాల ప్రజలు కామారెడ్డి జిల్లాకేంద్రానికి, పక్కన ఉండే రాజన్న సిరిసిల్ల జిల్లాలోని గంభీరావుపేటకు వెళ్తున్నారు. పాల్వంచలోనే ఆధార్ సెంటర్‌ను ప్రారంభించాలని మండలవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మాచారెడ్డి

రెండు మండలాల్లోనూ ఇబ్బందే..

నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లో ఆధార్ కేంద్రాలు లేవు. నిజాంసాగర్ మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఆధార్ కేంద్రాల కోసం సుమారు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న పిట్లం, ఎల్లారెడ్డి పట్టణాలకు వెళ్లాల్సి వస్తోంది. మహ్మద్‌నగర్ మండలంలోని 13 గ్రామ పంచాయతీల ప్రజలు 15 నుంచి 22 కిలోమీటర్ల దూరంలో ఉన్న బాన్సువాడ, ఎల్లారెడ్డి పట్టణాలకు వెళ్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉమ్మడి నిజాంసాగర్ మండలాలకు ఆధార్ కేంద్రాలను మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, మహ్మద్‌నగర్, నిజాంసాగర్

కనీసం రూ.300 ఖర్చు

డోంగ్లీ మండల ప్రజలు ఆధార్ సేవల కోసం మద్నూర్ మండలకేంద్రానికి వెళ్తున్నారు. సిర్పూర్, పెద్ద టాక్లీ గ్రామస్థులు దాదాపు 20 కిలోమీటర్ల దూరంలోని మద్నూర్‌కు వస్తున్నారు. ఆధార్‌లో చిన్న సవరణకైనా.. సుమారు రూ.300 నుంచి రూ.500 వరకు ఖర్చవుతోందని డోంగ్లీవాసులు పేర్కొంటున్నారు. - న్యూస్‌టుడే, మద్నూర్

సమయం వృథా

బీబీపేట మండలంలో ఆధార్ సేవా కేంద్రం లేక మండల ప్రజలు దోమకొండ, కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో సమయం, ప్రయాణ ఖర్చులు వృథా అవుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, కూలీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - న్యూస్‌టుడే, బీబీపేట

మురుగు వెళ్లే దారేది?

☛ బల్దియాల్లో ప్రణాళికాలోపంతో ప్రజలకు తప్పని ఇక్కట్లు

పరిశీలన

'కామారెడ్డి పట్టణంలోని వివేకానందకాలనీలో మురుగు నీటి వ్యవస్థ సక్రమంగా లేక వాన నీరంతా రోడ్లపై నిలుస్తోంది. రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పలుమార్లు పురపాలికలో ప్రతిపాదనలు సమర్పించినా ఇప్పటి వరకు కాల్వల నిర్మాణానికి అడుగులు పడలేదు.'



న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

ప్రణాళిక లోపం కారణంగా జిల్లాలో మురుగు నీటి వ్యవస్థ అధ్వానంగా మారింది. ఇళ్ల ఎదుట కాల్వలు లేక వ్యర్థ నీరు మడుగులు కడుతోంది. బల్దియాల్లో పాలకవర్గాలు కొలువుదీరి ఆరు మాసాలు కావస్తోంది. ప్రజలు సమస్యలపై ఫిర్యాదు చేసినా స్పందించేవారు లేరు. ఆదివారం బల్దియాల్లో న్యూస్‌టుడే పరిశీలన చేయగా లోపాలు వెలుగుచూశాయి.

పట్టణాల్లో ఇదీ పరిస్థితి..

కామారెడ్డి బల్దియా ఏర్పడి 40 ఏళ్లు దాటింది. 2008లో నిర్మించిన వరద నీటి కాల్వలు 2030 వరకు సరిపోతాయని అధికారులు అంచనా వేశారు. కాగా ఎనిమిదేళ్ల ముందే లక్ష్యం అభాసుపాలైంది. వరదలను తట్టుకునే సామర్థ్యం లేక సమస్య ఎదురవుతోంది. 2019లో బాన్సువాడ, ఎల్లారెడ్డి పురపాలికలు ఏర్పాటుకాగా.. కొద్ది నెలల కిందటే బిచ్కుంద బల్దియా ఏర్పడింది. బల్దియాల్లో ప్రణాళిక ప్రకారం కాల్వల నిర్మాణానికి చర్యలు చేపట్టలేదు. కాల్వలు తక్కువ ఎత్తు, వెడల్పులో నిర్మించడంతో చిరు వానలకే పొంగి పొర్లుతున్నాయి.

పురపాలిక	కాల్వలు(కి.మీ)	అవసరం
కామారెడ్డి	380	80
బాన్సువాడ	120	30
ఎల్లారెడ్డి	90	30
బిచ్కుంద	85	25

పాలకవర్గాలు దృష్టి పెట్టేనా?

సమస్యలపై కౌన్సిల్‌లో ప్రతిపాదనలు సిద్ధం చేసి పాలకవర్గ సమావేశం ఎజెండాలో పొందుపరిచి చర్చించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించడం లేదు. కొత్త పాలకవర్గాలు సమస్యలపై స్పందిస్తే మేలు.



'కామారెడ్డి జిల్లాకేంద్రంలోని సిరిసిల్లరోడ్డులో చిన్నపాటి వానకే నీరు మడుగులు కడుతోంది. ఈ ప్రాంతంలో అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఇక్కడ వాణిజ్య, వ్యాపార కేంద్రాలు ఉన్నాయి. దుకాణాల ఆవరణలోనే నీరు నిలుస్తోంది. ఏళ్ల నుంచి పనులు ముందుకు సాగక రోడ్లపై నీటి కష్టాలు తప్పడం లేదు.'

'అందరి అండతోనే ఎస్సీ వర్గీకరణ'

మద్నూర్, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్‌కు అన్ని పార్టీలు అండగా ఉండటంతోనే ఎస్సీ వర్గీకరణ విషయంలో విజయం సాధించామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. డోంగ్లీ మండలం హసన్‌టాక్లీ గ్రామంలో ఆదివారం అన్నా భావు సాఠే విగ్రహాన్ని మంద కృష్ణమాదిగ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయంలో సామాజిక న్యాయం ఉండటంతోనే 30 ఏళ్ల పోరాటానికి ఫలితం దక్కిందని గుర్తుచేశారు. మాజీ ఎంపీ బీబీ పాటిల్ మాట్లాడుతూ.. అన్నా భావు సాఠే ఆశయాలు నేటి తరానికి ఆదర్శం అన్నారు. ప్రతీఒక్కరు ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. మాజీ ఎమ్మెల్యేలు అరుణ తార, హన్మంత్ షిండే, గంగారాం పాల్గొని మాట్లాడారు. సమాజంలో భేదాభిప్రాయాలు లేకుండా మెలగాలని సూచించారు. సర్పంచులు దత్తు, లక్ష్మణ్, నాయకులు గజానంద్ దేశాయ్, కృష్ణ పటేల్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.



అన్నా భావు సాఠే విగ్రహావిష్కరణ అనంతరం మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ.. అరుణ తార హన్మంత్ షిండే, బీబీ పాటిల్, గంగారాం తదితరులు



యాతన పట్టదు.. వంతెన కట్టరు

పెద్దకొడప్‌గల్ మండలంలోని లింగంపల్లి నుంచి విఠల్‌వాడీతండాకు వెళ్లే రహదారిలో వంతెన కూలి ఏళ్లు గడుస్తున్నా చోదకుల యాతన ఎవరికీ పట్టడం లేదు. రూ.50 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో వంతెన నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు స్థానిక నాయకులతో కలిసి రెండేళ్ల కిందట పూజ చేశారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. – న్యూస్‌టుడే, పెద్దకొడప్‌గల్

రిపోర్టు కావాలా.. ఓపిక ఉండాలి చాలా

☛ బోధనాసుపత్రిలో ఒకే ప్రయోగశాలతో రోగులకు ఇక్కట్లు

'రాజంపేటకు చెందిన ఆరేళ్ల చిన్నారులు సాయిశ్రీ, యశస్విని జ్వరంతో బాధపడుతున్నారు. గ్రామంలో ప్రాథమిక వైద్యం పొందినా జ్వరం తగ్గకపోవడంతో జిల్లాకేంద్రంలోని బోధనాసుపత్రికి శుక్రవారం వచ్చారు. ఉదయం 9.30 గంటలకు వైద్య సేవలు పొందేందుకు రాగా వైద్యులు 10.30కి పరీక్షించి రక్త పరీక్షలకు సిఫార్సు చేశారు. 11 గంటలకు రక్త నమూనాలను సిబ్బందికి అందజేశారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాత నివేదిక ఇస్తామని పరీక్షల నిర్వాహకులు సూచించారు. ఓపీ వేళలు మధ్యాహ్నం ఒంటిగంటకే ముగిశాయి. వైద్యులకు నివేదిక చూపించేందుకు మరుసటి రోజు వరకు తల్లిదండ్రులు వేచిచూశారు.'

న్యూస్‌టుడే, కామారెడ్డి వైద్యవిభాగం

మెరుగైన వైద్యం కోసం జిల్లాకేంద్రంలోని బోధనాసుపత్రికి వస్తున్న రోగులకు నిరీక్షణ తప్పడం లేదు. నిత్యం ఓపీ 1200కు పైగానే ఉంటుండగా.. సకాలంలో అందరికీ వైద్యసేవలు అందడం లేదు. రోగ నిర్ధారణకు వైద్యులు రక్త పరీక్షలకు సిఫార్సు చేయడం.. ఆ పరీక్షల రిపోర్టు వచ్చేసరికి రోజు గడిచిపోవడంతో మారుమూల గ్రామాల నుంచి వచ్చేవారికి ఇక్కట్లు తప్పడం లేదు. బోధనాసుపత్రిలో ఒకే ప్రయోగశాల ఉండడం తీవ్ర సమస్యగా మారింది. రోగుల ఇక్కట్లపై కథనం.



కామారెడ్డి బోధనాసుపత్రిలో ప్రయోగశాల వద్ద రద్దీ

నమూనాల సేకరణలో జాప్యం

నిత్యం కనీసం 200 మందిని వైద్యులు పరీక్షల నిమిత్తం కేంద్రీకృత ప్రయోగశాలకు పంపుతున్నారు. ప్రయోగశాల వద్ద ఒక్కొక్కరి నమూనాలు సేకరించడానికి కనీసం మూడు నిమిషాలు పడుతోంది. గంటకు 20 మంది నమూనాలను సిబ్బంది సేకరిస్తున్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన ఓపీ సేవలు మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగుతున్నాయి. ఓపీ సమయం(మూడున్నర గంటల్లో)లో కేవలం 70 మంది నమూనాలు తీసుకోవడం సాధ్యపడుతుంది. దీంతో మిగిలిన వారు మరుసటి రోజు నమూనాలు ఇవ్వాల్సిన పరిస్థితి. ఈ పరీక్షల నివేదికలు అందేసరికి మరింత జాప్యం ఏర్పడుతోంది.

ఈ నెలలో నమోదైన వివరాలు

తేదీ	రక్తపరీక్షలకు సిఫార్సు
21	290
24	311
25	281
26	272
27	285
29	202

కేంద్రాల సంఖ్య పెంచితేనే..

బోధనాసుపత్రిలోని ప్రయోగశాలలో సేకరించిన రోగుల నమూనాలను కొన్నింటిని టీహబ్‌కి పంపుతున్నారు. ఆ నివేదికలు రావడంలోనూ ఆలస్యం అవుతోంది. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో పరీక్షలను విభజించాలి. మరో ల్యాబ్‌ను ఏర్పాటైతే పరీక్షలు త్వరగా పూర్తవుతాయి. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు స్పందిస్తూ.. అత్యవసర పరీక్షల నివేదికలను వెంటనే తెలియజేస్తున్నామని, సాధారణ పరీక్షలవి కొంత ఆలస్యమవుతున్నాయని అన్నారు. మరో ప్రయోగశాల ఏర్పాటుకు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

వాహన బీమా.. జీవితానికి ధీమా

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే (నిజామాబాద్)



మీకోసం

వాహనం ఏదైనా సరే.. ప్రమాద బీమాతోనే ధీమా ఉంటుంది. దురదృష్టవశాత్తు అనుకోని సంఘటనలు వాటిల్లితే.. ఎదుటి వారికి కూడా ఇన్సూరెన్స్ భరోసా కల్పిస్తుంది. ఒక వేళ ముందు జాగ్రత్త లేకుంటే ప్రమాద బాధిత కుటుంబాలన్నీ రోడ్డున పడాల్సిన దుస్థితి ఎదురవుతుంది. రవాణా శాఖ అంచనా ప్రకారం.. జిల్లాలో బీమా సదుపాయం ఉన్న వాహనాల సంఖ్య 45 శాతం మాత్రమే. ఈ నేపథ్యంలో ప్రతి వాహనదారుడు మేల్కోవాలి. బీమా భరోసాతో కూడిన ప్రయాణాలు కొనసాగించాలి.

వాహనాల సంఖ్య పెరుగుతున్నా..

జిల్లాలో ఏటేటా వాహనాల కొనుగోళ్లు ఎక్కువగా నమోదవుతున్నాయి. కొత్త వాహనాన్ని కొనుగోలు చేసినప్పుడు, లేదా రెన్యూవల్, ఫిట్‌నెస్ పరీక్షల సమయాల్లోనే చాలామంది బీమా చేయిస్తున్నారు. ఆ తర్వాత ప్రతి ఏటా పాలసీని రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ సందర్భంలోనే ఎక్కువ శాతం మంది నిర్లక్ష్యం చూపుతున్నారు. కొందరు రోడ్డు ప్రమాదాల బారినపడినప్పుడు ఆర్థికంగా కోలుకోలేని విధంగా దెబ్బతింటున్నారు. వైద్య ఖర్చులకు తోడు వాహన నష్టం అపారంగా ఉంటోంది. వాహన సామర్థ్యం ఆధారంగా ఏడాదికి రూ.వెయ్యి నుంచి రూ.25 వేల వరకు ప్రీమియం చెల్లిస్తే ముప్పు నుంచి భద్రత పొందవచ్చు. ముఖ్యంగా థర్డ్ పార్టీ ద్వారా ఎదుటి వ్యక్తికి.. అతడి వాహనానికి సైతం బీమా వర్తిస్తుంది. కాంప్రహెన్సివ్ పాలసీ, థర్డ్ పార్టీ సహా ఓన్ డ్యామేజ్ కింద ప్రీమియం చెల్లిస్తే ఇరుపక్షాలకు భరోసా ఉంటుంది.

ఆన్‌లైన్‌లో మోసాలకు అవకాశం

వాహన బీమా పాలసీల విషయంలోనూ మోసాలు వెలుగుచూస్తున్నాయి. ఆన్‌లైన్‌లో ప్రీమియం చెల్లించే సదుపాయం వచ్చాక మరింత అప్రమత్తంగా వ్యవహరించాల్సి వస్తోంది. కొందరు నకిలీ బీమా పత్రాలతో బురిడీ కొట్టిస్తున్నారు. పాత వాహనాల క్రయవిక్రయాల విషయంలోనూ మరింత జాగ్రత్తగా ఉండాలి. ఆ సమయంలో యాజమాన్య హక్కులు (ఓనర్‌షిప్) తప్పనిసరిగా బదిలీ చేయించుకోవాలి. లేకపోతే వాహనం కొన్న వ్యక్తి ఏదైనా ప్రమాదం చేసినా, నేరానికి పాల్పడినా రికార్డుల ప్రకారం అసలైన యజమానే నష్టాన్ని భరించాల్సి ఉంటుంది.

సదుపాయం తప్పనిసరి..

ప్రతి వాహనానికి బీమా తప్పనిసరి చేయించాలి. నిర్లక్ష్యంగా వాహనాలను నడిపేవారిపై చట్టం ప్రకారం చర్యలు తప్పవు. వాహనం విక్రయించినప్పుడు ఓనర్‌షిప్‌ను విధిగా బదిలీ చేయించుకోవాలి.

- రమేష్ రాథోడ్, డీటీవో, నిజామాబాద్

ప్రశాంతంగా నీట్ పీజీ

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: నిజామాబాద్ జిల్లాలోని అర్సపల్లి, మల్లారంలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో నీట్ (పీజీ) ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 265 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేశారు. వీరిలో 263 మంది పరీక్ష రాశారు. ఇద్దరు గైర్హాజరయ్యారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు పోలీస్ బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమైంది. అంతకు ముందే చేరుకున్న అభ్యర్థులను కేంద్రాల లోపలికి నిర్వాహకులు అనుమతి ఇచ్చారు. వారికి కావాల్సిన ఏర్పాట్లు చేశారు.

డిజిటల్ బోధన.. సులువుగా అవగాహన

రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల రూపురేఖలు మారుతున్నాయి. ఒకప్పుడు బ్లాక్‌బోర్డు, చాక్‌పీస్‌కే పరిమితమైన బోధన ఇప్పుడు డిజిటల్ తెరపై సాగుతోంది. ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరం సిలబస్ మారింది. దానికి అనుగుణంగా ఎల్లారెడ్డి, గాంధారితోపాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 37 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు డిజిటల్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఇంటరాక్టివ్ ప్యానెల్స్ ద్వారా భగవద్గీత శ్లోకాల నుంచి సైన్స్ పాఠాల వరకు దృశ్య రూపంలో బోధిస్తున్నారు. విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకుంటున్నారు. 'డిజిటల్ బోధనతో తరగతి గదులు ఆసక్తికరంగా మారుతున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతోంది. హాజరు శాతం కూడా పెరిగింది' అని గాంధారి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తెలిపారు. గాంధారి కళాశాలకు ఓ బ్యాంకు సహకారంతో 2, ఇంటర్ బోర్డు నుంచి 4 ఇంటరాక్టివ్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థల్లో సౌకర్యాలు కల్పించడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి, గాంధారి



గాంధారి: 'శతక మకరందం' పాఠ్యాంశాన్ని డిజిటల్ తెర ద్వారా బోధిస్తున్న అధ్యాపకుడు లక్ష్మణ్

ఆ.. ఖర్చులకు లెక్కలేదు

☛ ఆడిట్‌కు నోచుకోని ఈ-పంచాయతీ ఖాతాలు

న్యూస్‌టుడే,కామారెడ్డి కలెక్టరేట్



జిల్లాలో ఈ-పంచాయతీ వ్యవస్థ 2015లో ప్రారంభమైంది. జిల్లాలోని 25 మండలాలకు ప్రత్యేకంగా ఈ-పంచాయతీ ఖాతాలు ఉన్నాయి. గడిచిన 11 ఏళ్లుగా ఈ-పంచాయతీ ఖాతాలను ఆడిట్ చేయడం లేదు. ఈ ఏడాది కచ్చితంగా ఆడిట్ చేయిస్తామని పంచాయతీ అధికారులు ఐదు నెలల క్రితం పేర్కొన్నా.. కార్యరూపం దాల్చలేదు.

అడిగినా.. ఇవ్వడం లేదు

ఆడిట్ అధికారులు ప్రతి ఏడాది పంచాయతీలు, మున్సిపాలిటీలు, జిల్లా పరిషత్‌లు, మండలపరిషత్‌లు, మార్కెట్ కమిటీలు, దేవాదాయశాఖల ఆదాయ వ్యయాలను ఆడిట్ చేస్తారు. కానీ ఈ- పంచాయతీ ఖాతాల ఆదాయ వ్యయాలను మాత్రం ఆడిట్ చేయడం లేదు. ఈ ఖాతాలపై సర్వాధికారాలు తమకే ఉన్నాయన్నట్లుగా కొందరు ఎంపీవోలు వ్యవహరిస్తున్నారు. ఏటా పంచాయతీ ఆడిట్ ఖర్చుల లెక్కలు చూసే సమయంలో ఆడిటర్లు ఈ-పంచాయతీకి జమ చేసిన లెక్కల వివరాలను అడుగుతున్నారు. కానీ ఎంపీవోలు ఇవ్వడం లేదు. ఈ-పంచాయతీ ఖాతాలను ఆడిట్ చేయనివ్వడం లేదంటూ ఆడిట్ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ-పంచాయతీ ఖాతాలకు ఏడాదిలో ఎంత జమైంది.. ఎంత ఖర్చు చేశారో తెలిపే వివరాలను రసీదులతో ఆడిటర్లకు అందజేస్తే అనుమానాలకు తెర పడుతుంది.

నిర్వహణ అంతా వారి చేతుల్లోనే..

పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు ఏర్పాటయ్యాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా వచ్చాయి. అందులోంచి 5 శాతం నిధులను కార్యదర్శులు ఈ-పంచాయతీ ఖాతాల్లో జమ చేశారు. ఇందులో చిన్న, పెద్ద పంచాయతీలు రూ.8 వేల నుంచి రూ.1.80 లక్షల వరకు ఈ-పంచాయతీ ఖాతాల్లో జమ చేశారు. ఈ నిధులను ఖర్చు పెట్టే అధికారం ఆయా ఎంపీవోలకే ఉంటుంది. నిబంధనల ప్రకారం ఈ-పంచాయతీల్లో జమైన నిధులతో ఈ- పంచాయతీ ఆపరేటర్లకు వేతనాలు చెల్లించడం, స్టేషనరీ ఖర్చులకు వినియోగించుకోవాలి. కానీ కొందరు ఎంపీవోలు నిధులను ఇష్టానుసారంగా ఖర్చు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అవసరం ఉన్నప్పుడు వాడుకుని మళ్లీ ఖాతాల్లో జమ చేస్తున్నారు. వాహనాల అద్దెకు, ఇంధనానికి వినియోగించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

కోటీశ్వరులు అంటారు.. టోపీ పెడతారు!

వివరాలు 6లో...

ఇంట్లో కారం చల్లి.. బీరువా పగులగొట్టి..

'అభివృద్ధి నిధి'.. ఏదీ?

◆ నియోజకవర్గాలకు పైసా విదల్చని ప్రభుత్వం

◆ రెండున్నర ఏళ్లుగా ఎదురుచూపులు..

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి

శాసనసభ నియోజకవర్గాల ప్రగతికి ఉద్దేశించిన నియోజకవర్గ అభివృద్ధి నిధుల(సీడీఏఫ్)పై నీలినీడలు కమ్ముకున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా గత రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం సీడీఎఫ్ కింద పైసా విదల్చలేదు. దీంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

రూ.5 కోట్లకు పెంచినా..

నియోజకవర్గాల అభివృద్ధి, దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు సీడీఏఫ్ వినియోగిస్తారు. ప్రధానంగా అసంపూర్తి భవనాలు, అదనపు గదులు, సీసీ రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పించేందుకు ప్రాధాన్యమిస్తారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. గతంలో ఒక్కో నియోజకవర్గానికి ఏడాదికి రూ.3 కోట్ల చొప్పున విడుదల అవుతుండేవి. 2022-23లో అప్పటి ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.5 కోట్లకు పెంచింది. అందులోంచి 2023లో రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో నియోజకవర్గానికి రూ.2 కోట్ల చొప్పున విడుదల చేయగా.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 9 నియోజకవర్గాలకు కూడా కేటాయించింది. ఈ నిధులను ఆయా నియోజకవర్గాల్లో మన ఊరు-మన బడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల్లో గదుల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. మొదటి అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలోనే సీడీఏఫ్ విడుదల చేస్తామని ప్రకటించింది. తర్వాత జరిగిన బడ్జెట్ సమావేశాల్లో నియోజకవర్గ అభివృద్ధి నిధులు కేటాయించింది. కానీ, రెండున్నర ఏళ్లుగా ఉమ్మడి జిల్లాలోని ఒక్క నియోజకవర్గానికి కూడా పైసా నిధులు విడుదల చేయలేదు.

రూ. 90 కోట్లు..

ఉమ్మడి జిల్లాలో 9 నియోజకవర్గాలు ఉండగా ఒక్కో నియోజకవర్గానికి రూ.5 కోట్ల చొప్పున రెండేళ్లకు సంబంధించి సుమారు రూ. 90 కోట్ల సీడీఏఫ్ రావాల్సి ఉంది. ఆ నిధులు రాకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేలు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయినా ఫలితం కనిపించకపోగా.. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోతున్నామని ఎమ్మెల్యేలు సతమతమవుతున్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇన్‌ఛార్జి మంత్రుల ద్వారా ఎంతోకొంత ఇతర నిధులు పొందుతూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకు ఆ నిధులు కూడా నోచుకోవడం లేదు. ఇటు సీడీఏఫ్ నిధులు రాక.. మంత్రులు నిధులు కేటాయించక తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి మందగిస్తోందని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నియోజకవర్గాల అభివృద్ధి నిధులను సత్వరం మంజూరు చేయాలని కోరుతున్నారు.



ఎల్లారెడ్డిలో నిధులు లేక అసంపూర్తిగా నిలిచిపోయిన వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం

పల్లె క్రీడాకారులు.. కుస్తీలో మెరికలు..

న్యూస్‌టుడే, మోపాల్

మంచిప్ప గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు రెజ్లింగ్‌లో ప్రతిభ కనబర్చి ఇటీవల తెలంగాణ ప్రాంతీయ స్పోర్ట్స్ రెజ్లింగ్ అకాడమీకి ఎంపికయ్యారు. పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన కుస్తీ పోటీల్లో మల్లయోధులు తలపడే విధానం, మెళకువలు అందుకోవడం చూసిన విద్యార్థులు ఈ ఆటపై ఆసక్తిని పెంచుకున్నారు. మంచిప్ప జడ్పీహెచ్‌ఎస్ పీఈటీ దేవేందర్ వద్ద శిక్షణ పొంది మెలకువలు నేర్చుకున్నారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో సత్తాచాటి అకాడమీకి ఎంపికై తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు.

జిల్లాకు పేరు తేవడమే నా లక్ష్యం

- ప్రవీణ్, రమేశ్‌పూర్‌తండా



గత మూడేళ్లుగా నేను మంచిప్ప జడ్పీహెచ్‌ఎస్‌లో కుస్తీలో శిక్షణ తీసుకున్నా. మూడుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించా. రంగారెడ్డిలో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో వెండి పతకం సాధించా. గతేడాది సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. అండర్-17 ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో తలపడి రజతం సాధించా. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచిపేరు తేవడమే నా లక్ష్యం.

ప్రత్యక్షంగా చూసి నేర్చుకున్నా..

- బి.శ్రీకాంత్, మంచిప్ప



గ్రామంలో కుస్తీ క్రీడాకారులు పోటీపడడం ప్రత్యక్షంగా చూసి ఈ ఆట నేర్చుకోవాలని కోరిక కలిగింది. జడ్పీహెచ్‌ఎస్‌లో మెళకువల్లో శిక్షణ పొందా. రెండుసార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో నిజామాబాద్ జిల్లా తరఫున తలపడి పతకాలు సాధించా. రెజ్లింగ్ అకాడమీకి ఎంపికవడంతో సంతోషంగా ఉంది. మరింత శ్రద్ధతో శిక్షణలో మెలకువలు నేర్చుకుంటా. ఒలింపిక్స్‌లో పాల్గొనడం నా కల.

లక్ష్యం నిర్దేశించుకున్నా..

- బి.మహేందర్, మంచిప్ప



మంచిప్ప జడ్పీహెచ్‌ఎస్‌లో నా సీనియర్ క్రీడాకారులను చూసి రెజ్లింగ్‌పై ఆసక్తి పెరిగింది. వారు సాధించిన పతకాలను చూసి ఆకర్షితుడినై పీఈటీ వద్ద శిక్షణ పొందా. ప్రస్తుతం ప్రాంతీయ అకాడమీకి ఎంపికకావడం జరిగింది. రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో పాల్గొని బంగారు పతకాలు సాధించడమే నా లక్ష్యంగా నిర్దేశించుకున్నా.

పాంచజన్య సంకల్ప సభ విజయవంతానికి ఏర్పాట్లు

ర్యాలీ అనంతరం ప్రసంగించనున్న కల్వకుంట్ల కవిత

నిజామాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో సోమవారం జరగనున్న పాంచజన్య సంకల్ప సభకు పార్టీ నేతలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో మధ్యాహ్నం 3.40 గంటలకు సభ మొదలుకానుంది. నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల జిల్లాల నుంచి కార్యకర్తలను తరలించేందుకు నాయకులు ఏర్పాట్లు చేశారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సభకు హాజరై ప్రసంగించనున్నారు. ఆమె హైదరాబాద్ నుంచి బయల్దేరి మధ్యాహ్నం 2.30 గంటలకు ఇందల్వాయి చేరుకుంటారు. గన్నారం చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం నిజామాబాద్ శివారులోని మాధవనగర్ సాయిబాబా ఆలయం నుంచి 2.45 గంటలకు ర్యాలీగా సభా ప్రాంగణానికి బయల్దేరతారు. సాయంత్రం 6.30 గంటలకు నందిపేట మండలం సీహెచ్ కొండూరులోని రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు.



సభ నిర్వహించనున్న పాత కలెక్టరేట్ మైదానంలో తెలంగాణ రక్షణ సేన జెండాలు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : డా.భూపతిరెడ్డి

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని గ్రామీణ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రూరల్ క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని జక్రాన్‌పల్లి, నిజామాబాద్ గ్రామీణం, మోపాల్, ధర్పల్లి, ఇందల్‌వాయి మండలాల్లో పలు అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.99.60 లక్షల మంజూరు పత్రాలను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు అందజేసి మాట్లాడారు. సామాజిక సంఘ భవనాలు, ఆలయాలు, తండాలు, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుంచుతామని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సొసైటీ ఛైర్మన్లు, ఉప సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి

మారథాన్‌లో కామారెడ్డి కౌన్సిలర్‌కు పతకం

కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో ఎన్ఎండీసీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన మారథాన్‌లో కామారెడ్డి మున్సిపాలిటీ కౌన్సిలర్ గెరిగంటి లక్ష్మీనారాయణ పతకం అందుకున్నారు. నెక్లెస్‌రోడ్డు నుంచి గచ్చిబౌలి స్టేడియం వరకు గల 42 కిలోమీటర్ల దూరాన్ని లక్ష్మీనారాయణ 3.54 గంటల్లో ఆగకుండా పూర్తి చేశారు. ఈ టోర్నీ కోసం ఆయన మూడు నెలలుగా శ్రమించారు. నిత్యం 5 కి.మీ దూరం పరుగు సాధన చేశారు.



పతకం చూపుతున్న లక్ష్మీనారాయణ

సాంస్కృతిక విభాగ కో-కన్వీనర్‌గా ప్రీతిజైన్



కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కామారెడ్డి జిల్లాకేంద్రానికి చెందిన 44వ వార్డు కౌన్సిలర్ ప్రీతిజైన్ ఆదివారం భాజపా రాష్ట్ర సాంస్కృతిక విభాగ కో-కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర శాఖ నియామక పత్రాన్ని తాజాగా ఆమెకు అందజేసింది. తనపై నమ్మకం ఉంచి పదవి దక్కేందుకు కృషి చేసిన కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, భాజపా జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులుకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

1న జిల్లాస్థాయి యోగా పోటీలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: నిజామాబాద్ యోగా సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబరు 1వ తేదీన నందిపేట్‌లోని ఉజ్వల ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నామని ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐశ్వర్య, గంగాధర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబర్చిన వారిని వచ్చేనెల 12, 13 తేదీల్లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని.. వివరాలకు చరవాణి నంబర్ 80749 82200లో సంప్రదించాలని సూచించారు.

ఉత్తర్వుల ఉపసంహరణకు డిమాండ్

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వం 1-9తరగతుల సమ్మేటివ్ పరీక్షల జవాబు పత్రాలను మండల వనరుల కేంద్రంలో బాహ్య మూల్యాంకనం చేయించాలని ఇచ్చిన ఉత్తర్వులు తక్షణమే ఉపసంహరించుకోవాలని తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిషన్‌రెడ్డి, మధుసూదనాచారి ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే పాఠశాలల్లో బోధనేతర పనులతో విద్యార్థులు నష్టపోతున్నారని, బాహ్య మూల్యాంకనం మరింత ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని నిజామాబాద్ నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యాదగిరి పేర్కొన్నారు. ఆదివారం సుభాష్‌నగర్‌లోని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ భవనంలో సమావేశం నిర్వహించారు. మాస్టర్ ప్లాన్‌లో లోపాలు, అభ్యంతరాలు, మార్పులు పరిశీలించిన తర్వాత ప్లాన్ అమలు చేయాలన్నారు. బస్టాండ్ వద్ద రోడ్డు మరమ్మతులు చేపట్టి మౌలిక వసతులు కల్పించాలన్నారు. కమిటీ ప్రధానకార్యదర్శి రామ్మోహన్‌రావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యాదగిరి

పురావస్తు ప్రదర్శనశాల.. పునర్ వైభవం కలేనా?

న్యూస్‌టుడే, నిజామాబాద్ సాంస్కృతికం

నాలుగేళ్లుగా వేసిన తాళం వేసినట్టే ఉన్న వైనం

అది.. అపురూప శిల్పాలు, శిలాశాసనాలు, తాళపత్ర గ్రంథాలు, అరుదైన వస్తువులు నెలవైన పురావస్తు ప్రదర్శనశాల. రూ.లక్షలు వెచ్చించి కొన్నేళ్ల కిందట పునరుద్ధరణ పనులు పూర్తిచేశారు. కానీ, తగినంత మంది సిబ్బందితో పాటు అల్మారాలు లేవని గేటుకు తాళం వేశారు. జిల్లా కేంద్రంలో తిలక్‌గార్డెన్ ప్రాంగణంలోనున్న పురావస్తు ప్రదర్శనశాల కళతప్పిపోతోంది.



ప్రదర్శనశాలలో పిచ్చిమొక్కల మధ్య అరుదైన శిల్పాలు ఇలా..

గతమెంతో ఘనం..

ఇందూరు ఉత్సవాల్లో భాగంగా 2001లో అప్పటి కలెక్టర్ అశోక్‌కుమార్ చొరవతో తిలక్‌గార్డెన్ టౌన్‌హాల్‌లో పురావస్తు ప్రదర్శనశాలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అరుదైన శిల్పాలు, శిలాశాసనాలు, విశేష ప్రాచుర్యం గల తాళపత్ర గ్రంథాలు, నాణేలను సేకరించి ప్రదర్శనకు ఉంచారు. వారంలో ఒకరోజు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉచితంగా సందర్శించే అవకాశం కల్పించారు. భవనం పాతది కావడంతో వర్షాలకు గోడలు కురిశాయి. అరుదైన గ్రంథాలు, ఆభరణాలు తడిసి దెబ్బతినే పరిస్థితి ఎదురైంది. ఈ కారణంగా 2012-2014 మధ్య ప్రదర్శనశాలను మూసి ఉంచారు. ఆ తర్వాత నాలుగేళ్ల కిందట రూ. 40 లక్షలతో భవనాన్ని పునరుద్ధరించారు. కానీ, సిబ్బంది కొరత, అల్మారాల్లేవంటూ అప్పటి నుంచి ఆ మ్యూజియం తాళాలు తీయడం లేదు. మరోవైపు ఆకతాయిలు గోడలపై రాతలు గీస్తూ సున్నం, రంగులను చెరిపేస్తున్నారు.



గోడలపై ఆకతాయిలు గీసిన రాతలు

చూస్తున్నారు.. వెళ్తున్నారు..

ప్రదర్శనశాల పునరుద్ధరణ ఆవశ్యకతపై 'ఈనాడు'లో వరుసగా కథనాలు ప్రచురితం అయ్యాయి. రాష్ట్ర పురావస్తు పరిశోధన శాఖ సంచాలకుడు ఆచార్య అర్జున్‌రావు, ఏడీ సాగర్ తదితరులు స్పందించి ఏప్రిల్ 4వ తేదీన మ్యూజియాన్ని స్వయంగా పరిశీలించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రదర్శనశాలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పి వెళ్లారు. ఆ తర్వాతా పరిస్థితిలో ఎలాంటి మార్పులేదు. మరో రూ.4 లక్షలతో పది అల్మారాలు ఏర్పాటుచేసి, కొందరు నిర్వహణ సిబ్బందిని నియమిస్తే ప్రదర్శనశాలకు పూర్వ వైభవం వస్తుందని చరిత్ర పరిశోధకులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ అయినా స్పందించి మ్యూజియంను పునఃప్రారంభించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు

దోమకొండ, న్యూస్‌టుడే: దోమకొండలోని గడీ కోట మైదానంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు(జూనియర్ విభాగంలో) ఆదివారం నిర్వహించారు. ఆర్చరీ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు తీగల తిర్మల్‌గౌడ్ పోటీలను ప్రారంభించారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇండియన్ రౌండ్ విభాగంలో.. బాలికలు(జె.లైలా, కె.ప్రీతి, కె.అంజలి, ఎ.శ్రావ్య, జె.శ్రీజ, ఎన్.భావన), బాలురు (జి.ప్రణీత్, ఎస్.కె.రేహాన్, రామ్‌చరణ్, ఇ.అరవింద్, ఎస్.డి.సోఫియన్, ఎస్.స్నేహిత్), రికర్వ్ రౌండ్ విభాగంలో.. బాలికలు(బి.ఇందు, బి.వైష్ణవి, ఎన్.వర్షిత), బాలురు (ఎం.అనుదీప్, ఎ.నవీన్, డి.అకుల్, ఎన్.రుత్విక్, డి.హేమంత్, ఎస్.నిశిత్‌కుమార్), కాంపౌండ్ రౌండ్ విభాగంలో బి.సురేష్‌చౌదరి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో శిక్షకుడు ప్రతాప్‌దాస్, అసోసియేషన్ ప్రతినిధులు నర్సింహారెడ్డి, మోహన్‌రెడ్డి, రాంచంద్రం పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులతో సంఘం జిల్లా అధ్యక్షుడు తిర్మల్‌గౌడ్

కోటీశ్వరులు అంటారు.. టోపీ పెడతారు!

☛ అత్యాశకు పోతే ఖాతా ఖాళీ

☛ యాప్స్‌తో జాగ్రత్త

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి, సదాశివనగర్

ఆన్‌లైన్ డేటింగ్, నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, బోగస్ ప్రకటనలు ప్రజలను ఆర్థికంగా నష్టాలకు గురిచేస్తున్నాయి. నకిలీవా, అసలువా అని తెలుసుకోకుండా యాప్‌లను కొందరు చరవాణుల్లో డౌన్‌లోడ్ చేసుకుంటూ కష్టాలను కొని తెచ్చుకుంటున్నారు. తక్కువ సమయంలో అధిక మొత్తంలో సంపాదించొచ్చు అన్న ఆశతో కొందరు నకిలీ ట్రేడింగ్ యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుంటూ సైబర్ నేరస్థుల ఉచ్చులో చిక్కుకుంటున్నారు. మరికొందరు యువకులు.. యువతులు, మహిళలతో పరిచయాలు పెంచుకోవాలన్న మోజులో సర్వస్వం కోల్పోతున్నారు.

వల విసిరి.. ముఖం చాటేసి

నగరాల మాదిరిగా మండలాలు, గ్రామాలకు సైతం ఆన్‌లైన్ డేటింగ్ సంస్కృతి విస్తరిస్తోంది. కొందరు యువకులు.. మహిళలు, యువతులతో సులభంగా పరిచయాలు పెంచుకునేందుకు డేటింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఆన్‌లైన్ వేదికగా స్నేహితులు, ప్రేమికులను, కాబోయే జీవిత భాగస్వాములను వెతుక్కుంటున్నారు. యువకుల్లో పెరుగుతున్న ఈ ధోరణి పెను ప్రమాదానికి దారితీస్తోంది. కొన్ని యాప్‌లు నకిలీ ప్రొఫైల్ ఫొటోలు, వివరాలు అడ్డుగా పెట్టుకుని యువతను ఆకర్షిస్తున్నాయి. మహిళలు, యువతులతో మాట్లాడటానికి, చనువుగా ఉండటానికి, ఏకాంతంగా గడపడానికి అంటూ యువకులకు వల విసురుతూ ఆన్‌లైన్‌లో అడ్డగోలుగా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నారు. అనంతరం ఫోన్లకు స్పందించకుండా ముఖం చాటేస్తున్నారు. డబ్బులు కోల్పోయిన తర్వాత గానీ తాము మోసపోయామని యువకులు గుర్తించడం లేదు. తేరుకునేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. ఎల్లారెడ్డి నియోజకవర్గం సదాశివనగర్ మండలానికి చెందిన ఓ యువకుడు ఇలాగే మోసపోయాడు.

ట్రేడింగ్.. ఫ్రాంఛైజీల పేరుతో..

షేర్ మార్కెట్‌లో డబ్బులు పెడితే రాత్రికి రాత్రే కోటీశ్వరులు అవుతారని సైబర్ నేరస్థులు అమాయకులను బురిడీ కొట్టిస్తున్నారు. టెలిగ్రాం గ్రూపుల్లో చేరండి, పెట్టుబడి పెడితే రెట్టింపు లాభం వస్తుందంటూ చేర్చుకుంటున్నారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేయించుకుంటున్నారు. లాభాలు వచ్చినట్లు తెరపై చూపిస్తున్నారు. ఆ డబ్బు తీసుకోవాలంటే పన్నుల పేరుతో మరింత దండుకుంటున్నారు. డబ్బులు వస్తాయన్న ధీమాతో ఉన్న వారి ఖాతాలు ఖాళీ చేసి కుచ్చుటోపీ పెడుతున్నారు. యాప్, టెలిగ్రాంలో ఇచ్చిన నంబర్లు పనిచేయకపోవడంతో మోసపోయామని గ్రహిస్తున్నారు.

అప్రమత్తతతోనే మేలు..

సైబర్ నేరస్థులు ఎప్పటికప్పుడు సరికొత్త సాంకేతికతను వాడుకుంటూ రకరకాల యాప్‌లు, టెలిగ్రాం ఛానళ్లను రూపొందిస్తున్నారు. వాటిని నమ్మి అపరిచితులకు డబ్బులు పంపితే మోసపోవడం ఖాయమని నిపుణులు, పోలీసులు స్పష్టం చేస్తున్నారు. అప్రమత్తతతోనే ఇలాంటి యాప్‌లు, టెలిగ్రాంల బారి నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.

మూడు ద్విచక్ర వాహనాలు ఢీ..

ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు



డిచ్‌పల్లి : రోడ్డుపై ఉన్న గుంతను తప్పించడానికి ఒకరు ఆకస్మికంగా ద్విచక్రవాహనం బ్రేక్ వేసి పక్కకు రావడంతో ఒకేసారి మూడు ద్విచక్ర వాహనాలు ప్రమాదం బారిన పడ్డాయి. ఈ ఘటనలో మెంట్రాజ్‌పల్లికి చెందిన **గుర్రపు కిషన్**(46) అక్కడికక్కడే మృతిచెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై ఆరిఫ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మెంట్రాజ్‌పల్లికి చెందిన కిషన్ పని నిమిత్తం సుద్దులం వెళ్లి తిరిగి వస్తుండగా.. యానంపల్లికి చెందిన నవీన్ ద్విచక్ర వాహనంపై అటువైపే వెళ్తున్నారు. సుద్దపల్లి గురుకులం సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతను తప్పించడానికి నవీన్ ఆకస్మికంగా బ్రేక్ వేసి కిషన్‌కు అడ్డురావడంతో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. అదే సమయంలో నిజామాబాద్ నుంచి రామడుగువైపు కుటుంబ సభ్యులకు వెళ్తున్న ప్రదీప్ ద్విచక్రవాహనానికి వీరు తగలడంతో వారు సైతం ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో కిందపడిన కిషన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందగా.. ముగ్గురు గాయాలపాలయ్యారు. దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు దగ్ధం.. తప్పిన ప్రమాదం

చేగుంట, న్యూస్‌టుడే: కారులో ఒక్కసారిగా మంటలు ఎగసిపడగా.. త్రుటిలో ప్రమాదం తప్పిన ఘటన మెదక్ జిల్లా చేగుంట సమీపంలోని 44వ జాతీయ రహదారి బైపాస్‌లో ఆదివారం చోటుచేసుకుంది. భిక్కనూరుకు చెందిన మనోజ్, మీనాక్షితో పాటు మరొకరు కారులో హైదరాబాద్‌కు బయలుదేరారు. చేగుంట బైపాస్ సర్కిల్ వంతెనపైకి రాగానే పొగలు వచ్చాయి. వంతెన దిగిన తర్వాత కారును పక్కకు ఆపారు. అందులో ప్రయాణిస్తున్న వారు కిందకు దిగి.. ఇంజిన్ భాగాన్ని పరిశీలిస్తుండగానే మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. గ్యాస్‌తో నడిచే కారు కావడంతో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు చెలరేగి ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. రామాయంపేట నుంచి అగ్నిమాపక శకటం వచ్చి మంటలను ఆర్పివేసింది. అప్పటికే కారు పూర్తిగా దగ్ధమైంది.



పొలం బురదలో పడి రైతు మృతి

నిజామాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు పంట పొలంలోని బురదలో పడి రైతు మృతి చెందిన ఘటన గ్రామీణ మండలం డివిజన్-3 గూపన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రూరల్ రాణా ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భోగ రాజు(40) ఆదివారం తన వ్యవసాయ పొలంలో పురుగుల మందు పిచికారీ చేయడానికి వెళ్లారు. పని ముగించుకొని ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో మట్టి రోడ్డుపై వాహనం అదుపుతప్పి ప్రమాదవశాత్తు పక్కన ఉన్న పంట పొలంలోని బురదలో పడ్డారు. రాజు ముఖం బురదలో కూరుకుపోవడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. ఆయన తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. రాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇంట్లో కారం చల్లి.. బీరువా పగులగొట్టి..

30 తులాల బంగారం చోరీ..

మాక్లూర్, న్యూస్‌టుడే: కొత్తపల్లిలో ఆదివారం తెల్లవారుజామున భారీ చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వేములపల్లి శ్రీనివాస్‌రావు తన కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు రోజుల కిందట హైదరాబాద్ వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. తమ ఆనవాళ్లు తెలియకుండా ఉండేందుకు గదుల్లో కారం చల్లారు. తర్వాత బీరువాలోని 30 తులాల బంగారం, 300 గ్రాముల వెండిని తీసుకొని పారిపోయారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు బాధితుడు హైదరాబాద్ నుంచి సొంతూరుకు చేరుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు ఎస్సై అనిల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీం, పోలీస్ డాగ్స్‌ను రప్పించారు. ఎలాంటి ఆధారాలు లభించలేదు. పెద్ద మొత్తంలో చోరీ జరగడం స్థానికంగా కలకలం రేపింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని, దొంగలను త్వరలో పట్టుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.



చిందర వందరగా పారేసిన వస్తువులు

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

బాన్సువాడ 83284 29129

కామారెడ్డి 93970 82242

ఎల్లారెడ్డి 94410 27839

జుక్కల్ 94924 00777

● **స్పందన:** కామారెడ్డి జిల్లాకేంద్రంలోని 12,13వ వార్డుల్లో చెత్త తీయడం లేదని వెంకటేశ్, రాజు తెలపగా పారిశుద్ధ్య బాధ్యుడు ప్రశాంత్ చెత్త తీయించారు.

● కామారెడ్డిలోని 3వ వార్డులో కల్వ పూడిక తీయడం లేదని నాగేందర్ తెలపగా పారిశుద్ధ్య బాధ్యుడు ప్రశాంత్ స్పందించారు. కల్వ పూడిక తీయించారు. - న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

● బాన్సువాడలోని టీచర్స్ కాలనీలో పలు చోట్ల మురుగు కాల్వల్లో చెత్త నిల్వలు పేరుకుపోవడంతో దుర్వాసనతో ఇబ్బందిగా ఉందని స్థానికులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు వద్ద ప్రస్తావించగా ఆయన సిబ్బందితో చెత్త నిల్వలు తొలగింపజేసి సమస్యను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

● బాన్సువాడలోని కొయ్యగుట్ట కాలనీలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రి సమయాల్లో ఇబ్బందిగా ఉంటుందని స్థానికులు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయమై వీధి దీపాల పర్యవేక్షకుడు సాయికిరణ్ వద్ద ప్రస్తావించగా ఆయన సిబ్బందితో మరమ్మతులు చేయించి సమస్యను పరిష్కరించారు. - న్యూస్‌టుడే, బాన్సువాడ పట్టణం

సమస్య: అల్మాజీపూర్‌లో మురుగు కాల్వలు పూడిక తీయడం లేదు. దుర్వాసన వస్తోంది. - రాజయ్య, స్థానికుడు

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందితో పూడిక తీయించి దుర్వాసన రాకుండా చూస్తాం. - వినోద్, గ్రామ కార్యదర్శి - న్యూస్‌టుడే, ఎల్లారెడ్డి

సమస్య: ఇస్సన్నపల్లి గ్రామంలో పంచాయతీ కార్యాలయం పక్కన నీటితొట్టి వృథాగా ఉంది. - రాములు, గ్రామస్థుడు

సమాధానం: నీటితొట్టెకు నీటి సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకుంటాం. - నాగేశ్వర్, ఎంపీడీవో - న్యూస్‌టుడే, రామారెడ్డి



గ్రామస్థులకు వైకుంఠ రథం అందజేసిన ప్రభాకర్‌రెడ్డి

వైకుంఠ రథం అందజేత

కామారెడ్డి గ్రామీణం: కామారెడ్డి మండలం ఉగ్రవాయికి చెందిన భారాస యువజన విభాగం మండల ఉపాధ్యక్షుడు పందిరి ప్రభాకర్‌రెడ్డి తన తల్లిదండ్రులు పందిరి అనుసూయ-మల్లారెడ్డిల జ్ఞాపకార్థం గ్రామానికి ఆదివారం వైకుంఠరథం అందజేశారు. భారాస యువజన విభాగం నాయకుడు గంప శశాంక్, స్థానికులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు నేడు చివరి తేదీ

ఎల్లారెడ్డి: ఓపెన్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలకు సోమవారం(31వ తేదీ) తుది గడువు అని మండల సమన్వయకర్త కృష్ణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు ఎల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సంప్రదించాలన్నారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి'

బాన్సువాడ పట్టణం: ప్రభుత్వం ఉపాధ్యాయులపై మానసిక వేధింపులు ఆపాలని ఎస్టీటీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యాల సంతోష్ పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్ఏ 1, 2 పరీక్షల బాహ్య మూల్యాంకనం నిర్ణయం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకరు, ఇద్దరు ఉపాధ్యాయులతో ప్రాథమిక పాఠశాలలో నాణ్యమైన విద్య ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. సమావేశంలో సంఘ నాయకులు శ్రీకాంత్, పండరి, ప్రవీణ్‌కుమార్, నిఖిల్‌కుమార్, శ్రీనివాస్, అనిల్, సంతోష్ ఉన్నారు.



మాట్లాడుతున్న అయ్యాల సంతోష్...

దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

బీర్కూర్: తనను అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ బరంగెడ్గి గ్రామ సర్పంచి రెంజర్ల అనిల్ ఆదివారం బీర్కూర్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. బరంగెడ్గి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం కొనసాగుతోంది. ఇందూర్ గజేందర్ ఇంటి ముందు అరుగు తీయకుండా గుత్తేదారుడు డ్రైనేజీని వంకరగా నిర్మిస్తుండగా సర్పంచి గమనించారు. నిబంధనల ప్రకారం అరుగు తీసి డ్రైనేజీని సమాంతరంగా నిర్మించాలంటూ సర్పంచి గుత్తేదారుడికి సూచిస్తుండగా.. గజేందర్ జోక్యం చేసుకుని తనను దూషించినట్లు ఫిర్యాదు చేశారు.

ఆలయంలో చోరీ

గాంధారి: మండలంలోని పొతంగల్ కలాన్ శివారులోని బుగ్గగండిలో బుగ్గరామేశ్వరాల ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని రెండు హుండీలను పగులగొట్టి వాటిలోని రూ.8 వేల నగదు ఎత్తుకెళ్లారు. ఆలయ పూజారి స్వామివిశ్వనాథ్ ఆదివారం ఉదయం గమనించి ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ తెలిపారు. చోరీ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఆదివారం చెప్పారు

డ్రోన్ యంత్రం.. ఉపాధికి ఊతం

● ఆధునిక సాంకేతికతతో స్వయం సమృద్ధి ● రైతులకు కూలీల సమస్య దూరం

పంటల సాగులో నష్టాలను అధిగమించి మెరుగైన దిగుబడులు సాధించేందుకు రైతులు ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. కొందరు యువరైతులు ఆధునిక సాంకేతికతతో తయారు చేసిన యంత్రాలతో పంటలు సాగు చేస్తున్నారు. ఇతరుల వ్యవసాయ అవసరాల కోసం కూడా అద్దెకు ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. ఎరువుల పిచికారీ గ్రామాల్లో కూలీల కొరత నెలకొంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని పలువురు యువ రైతులు పిచికారీ కోసం డ్రోన్లను అద్దెకిస్తూ కూలీల కొరత సమస్యను తీర్చడంతో స్వయం సమృద్ధి సాధిస్తున్నారు.

ఏడాదికి రూ.6 లక్షల ఆదాయం



ఎల్లారెడ్డి, తాడ్వాయి, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డి నియోజకవర్గం తాడ్వాయి మండలం సోమారం గ్రామానికి చెందిన చరణ్‌రెడ్డి గతేడాది రూ.4.60 లక్షలతో డ్రోన్ యంత్రం కొనుగోలు చేశారు. తాను సాగు చేస్తున్న 10 ఎకరాల వరి పొలానికి ఈ పరికరం ద్వారా పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. కూలీల కొరతను దృష్టిలో పెట్టుకుని ఎల్లారెడ్డి, తాడ్వాయి మండలాల్లోని ఇతర రైతులకు గంటకు రూ.500 చొప్పున అద్దెకు ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. డ్రోన్ కొనుగోలు ఖర్చులు పోనూ ఏడాదిలో రూ.6.40 లక్షల ఆదాయం వచ్చిందని చరణ్‌రెడ్డి తెలిపారు

సమయం ఆదా.. తగ్గిన శ్రమ



మద్నూర్, న్యూస్‌టుడే: డోంగ్లీ మండలం కుర్లా గ్రామానికి చెందిన యువరైతు అశోక్ ఆరు ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారు. తన వ్యవసాయ అవసరాల కోసం రూ.4.20 లక్షలతో డ్రోన్ స్ప్రే యంత్రం కొనుగోలు చేశారు. దాని ద్వారా వరి, మొక్కజొన్న పంటలకు పురుగు మందు పిచికారీ చేస్తున్నారు. అనంతరం ఇతర రైతులకు ఎకరానికి రూ.350 చొప్పున అద్దెకు ఇస్తూ ఉపాధి పొందుతున్నారు. పంటల సీజన్‌లో ఖర్చులు పోను రోజుకు రూ.8 వేల లాభం వస్తుందని, దీని ద్వారా రైతులకు సమయం ఆదా అయి శ్రమ తగ్గుతుందని తెలిపారు.

తక్కువ సమయంలో.. ఆదాయం అధికం..



పిట్లం, న్యూస్‌టుడే: పిట్లం మండల రైతులను కూలీల కొరత వేధిస్తోంది. ఈ సమస్య కారణంగా కొందరు రైతులు సాగును దూరం చేసుకుంటున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకున్న పిట్లం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన యువకుడు నాగరాజ్ రూ.4 లక్షలతో డ్రోన్ కొనుగోలు చేశారు. పత్తి, వరి, సోయాబీన్, మొక్కజొన్న, జొన్న తదితర పంటలకు పురుగు మందు పిచికారీ చేయడానికి అద్దెకిస్తూ కూలీల కొరత సమస్యకు పరిష్కారం చూపుతున్నారు. ఎకరం పిచికారీకి రూ.300 నుంచి రూ.400 వరకు అద్దెకు ఇస్తూ నెలకు రూ.40 వేల ఆదాయం పొందుతున్నానని నాగరాజ్ చెప్పారు.

నెలకు రూ.70 వేలు..

బిచ్కుంద గ్రామీణం, న్యూస్‌టుడే: బిచ్కుంద మండలం పుల్కల్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఏడాది క్రితం సుమారు రూ.5 లక్షలతో డ్రోన్ కొనుగోలు చేశారు. దాన్ని పంటల పిచికారీ కోసం రైతులకు అద్దెకు ఇస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. ఎకరం పొలం పిచికారీకి రూ.350 చొప్పున అద్దెకు ఇస్తున్నానని, అన్ని ఖర్చులు పోనూ నెలకు రూ.70 వేల వరకు ఆదాయం వస్తుందని శ్రీకాంత్ చెప్పారు. దీని ద్వారా కూలీల సమస్య తీరడంతోపాటు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పంటలకు పిచికారీ చేయొచ్చని వివరించారు.





మత్తమాలలో శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన పైడి ఎల్లారెడ్డి

శివాజీ ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకం

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యసాహసాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం అని భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డి మండలం మత్తమాల గ్రామంలో ఆదివారం ఆయన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. యువతలో దేశభక్తిని పెంపొందించడానికి కృషి చేసిన శివాజీ మహారాజ్‌ను యువకులు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, దాత రాంగోపాల్ రెడ్డి, ప్రతినిధులు అనుసుజారెడ్డి, రవీందర్‌రావు, భారతమ్మ, జలంధర్‌రెడ్డి, ఉషాగౌడ్, నర్సింలు, వినోద్, తులసీదాస్ పాల్గొన్నారు.

పాలనలో కాంగ్రెస్ విఫలం

బాన్సువాడ, న్యూస్‌టుడే: వేయి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. ఆదివారం బాన్సువాడలో ఏర్పాటు చేసిన సమరభేరి సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించడానికి ఎనిమిది రోజుల పాటు పోరుబాట కార్యక్రమానికి భారాస శ్రీకారం చుట్టిందన్నారు. బాన్సువాడను తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే అభివృద్ధి చేశానని తెలిపారు. కేసీఆర్ దయతో నియోజకవర్గానికి నిధులు ఎక్కువ వచ్చాయని పోచారం చేసింది ఏమీలేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, భారాస నాయకులు మోరియల్ శ్రీనివాస్, దుద్దాల అంజిరెడ్డి, షేక్ జుబేర్, నార్లరత్నకుమార్, ధర్మతేజ, సాయిబాబా, రమేష్‌యాదవ్, శ్రీనివాస్, అక్బర్, ఖలీల్, మక్బుల్, కృష్ణ, ఉమామహేష్; సాయిలు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్



టీఆర్ఎస్‌లో చేరిన వారితో పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంపత్‌గౌడ్

'పాంచజన్య పథకాలతో టీఆర్ఎస్‌కు అధికారం'

సదాశివనగర్, న్యూస్‌టుడే: టీఆర్ఎస్(తెలంగాణ రక్షణ సేన) అధినేత కల్వకుంట్ల కవిత ప్రకటించిన పాంచజన్య పథకాలతోనే రాష్ట్రంలో తాము అధికారంలోకి వస్తామని ఆ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంపత్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి, అమర్లబండ, తుక్కోజివాడి గ్రామాలకు చెందిన పలువురు నాయకులు ఆదివారం సదాశివనగర్‌లో జరిగిన కార్యక్రమంలో టీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరికి ఉచిత వైద్యం, విద్య అందించాలనే లక్ష్యంతో తమ పార్టీ ముందుకెళ్తుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు సాయాగౌడ్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి శ్రీకాంత్‌రెడ్డి, లింగం, సాయిలు, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో భాజపాదే విజయం'

నాగిరెడ్డిపేట్, న్యూస్‌టుడే: రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో భాజపా గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం నాగిరెడ్డిపేట్‌లో ఆయన భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పైడి ఎల్లారెడ్డితో కలిసి ఆ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నీలం చిన్నరాజులు మాట్లాడుతూ.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో గత భారాస ప్రభుత్వం మాదిరే ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు కూడా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విరుచుకుపడ్డారు. రెండు ప్రభుత్వాల కారణంగా విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.15 వేల కోట్ల వరకు పేరుకుపోయాయని విమర్శించారు. ప్రభుత్వం ఆ మొత్తాన్ని పక్షం రోజుల్లో చెల్లించకపోతే విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు చేపడతామని హెచ్చరించారు. భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మడుపు శ్రీనివాస్, నాయకులు హన్మండ్లు, శ్రీకాంత్, నరేందర్‌రెడ్డి, మీరాతాయి, రాజిరెడ్డి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేట్‌లో భాజపా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న నీలం చిన్నరాజులు

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

పిట్లం, న్యూస్‌టుడే: పిట్లంలో ఆదివారం బారడి పోచమ్మ బోనాల పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. బ్యాండు మేళాలు, డప్పుచప్పుళ్ల మధ్య శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మహిళలు ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

మద్నూర్: మండల కేంద్రంలోని పాత బస్టాండ్ హనుమాన్ ఆలయంలో విగ్రహ పునః ప్రతిష్ఠాపనను వైభవంగా నిర్వహించారు. ధ్వజ స్తంభం, శిఖరాలను ప్రతిష్ఠించి హోమాలు, యజ్ఞ యాగాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఎంపీ బీబీ పాటిల్, మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పాల్గొన్నారు.

బాన్సువాడ గ్రామీణం: మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు అవసరమైన నిధులు అందజేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

వార్‌కారీల దిండి యాత్ర..

పెద్దకొడప్‌గల్: జుక్కల్ మండలం లాడేగావ్ గ్రామానికి చెందిన వార్‌కారీలు ఆదివారం దిండి యాత్రను ప్రారంభించి పెద్దకొడప్‌గల్ మండల కేంద్రానికి చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గంగారాంను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం పిట్లం మండలం చిన్నకొడప్‌గల్ గ్రామ పరిధిలోని రామలింగేశ్వర మందిరం వరకు పాదయాత్రగా వెళ్లారు. అంతేశ్వర్ గురూజీ, వార్‌కారీలు సంగయప్ప మహరాజ్, లక్షెట్టి మహరాజ్, తుకారాం మహరాజ్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రతుల ఆవిష్కరణ

కామారెడ్డి పట్టణం: జిల్లాకేంద్రంలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవ ప్రతులను ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు ఆదివారం కామారెడ్డిలో ఆవిష్కరించారు. సంస్థ కామారెడ్డి బాధ్యుడు వెంకటదాస్ మాట్లాడుతూ. . నిత్యం ఉదయం 5 గంటల నుంచి భజన, కీర్తన, సాంస్కృతిక కార్యక్రమాలు చేపడతామన్నారు. మధ్యాహ్నం అభిషేకం పూర్తయ్యాక అన్నదానం చేస్తామన్నారు. కామారెడ్డిలోని రామారెడ్డిరోడ్డు ఇస్కాన్ కేంద్రానికి భక్తులు రావాలని సూచించారు.

ఆలయాభివృద్ధికి విరాళాలు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని హౌసింగ్‌బోర్డుకాలనీ శారదాంబ ఆలయాభివృద్ధికి దాతలు చేయూతనిచ్చారు. వాణి-లింగారెడ్డి దంపతులు రూ.51 వేలు, సరస్వతి-సూర్యకాంతం దంపతులు రూ.25 వేల విరాళాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆదివారం అందజేశారు.



పిట్లంలో బోనాల ఊరేగింపులో మహిళలు

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నస్రుల్లాబాద్, న్యూస్‌టుడే: మైలారం శివారులోని కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం సామూహిక వన భోజనాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఉన్నారు.

4న వేద యజ్ఞ మహోత్సవం

బాన్సువాడ పట్టణం: పట్టణంలోని ఆర్యసమాజ మందిరంలో సెప్టెంబరు 4న వేద యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆర్యసమాజ్ ప్రధాన్ గంప నరేష్ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమ కరపత్రాలను ఆదివారం ఆయన ఆర్యసమాజ్‌లో ఆవిష్కరించి మట్లాడారు. మూడు రోజుల పాటు యజ్ఞం, యజుర్వేద పారాయణం ఉంటుందని, అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.



పెద్దకొడప్‌గల్‌లో పాదయాత్రగా వెళ్తున్న భక్తులు



కామారెడ్డిలో ప్రతులు ప్రదర్శిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు



దంపతులను సన్మానిస్తున్న శారదాంబ ఆలయ కమిటీ ప్రతినిధులు



కొటాల్‌పల్లిలో అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం

నత్తనడకన నిర్మాణాలు

కామారెడ్డి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఐదేళ్లు గడుస్తున్నా.. కామారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ భవనాల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. మండల పరిధిలోని కొటాల్‌పల్లి, శాబ్దిపూర్ తండా, క్యాసంపల్లి తండా, ఇస్రోజివాడి గ్రామాల్లో ఇప్పటికీ సొంత భవనాలు లేక పంచాయతీ పాలన కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ బడుల్లోనే కొనసాగుతోంది. కొటాల్‌పల్లిలో పంచాయతీ భవన నిర్మాణం కేవలం గోడల వరకే కాగా.. మరికొన్ని గ్రామాల్లో తుది దశకు చేరిన పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. సొంత భవనాలు లేక పంచాయతీ రికార్డులు, ముఖ్యమైన పత్రాలు భద్రపరుచుకోవటానికి కార్యదర్శులు నానా అవస్థలు పడుతున్నారు. మరోవైపు పంచాయతీ సమావేశాలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించటం వల్ల విద్యార్థుల తరగతులకు అంతరాయం కలుగుతోంది. ఈ విషయమై ఎంపీడీవో హెప్సిబారాణిని వివరణ కోరగా.. నిర్మాణంలో ఉన్న భవనాల పనులను వేగవంతం చేసి, రాబోయే ఒకట్రెండు నెలల్లో గ్రామాలకు అప్పగిస్తామని తెలిపారు.



మాట్లాడుతున్న విద్యార్థిసేన జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్

'సమస్యలపై పాలకుల నిర్లక్ష్యం'


కామారెడ్డి పట్టణం: సమస్యలపై పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు కొత్మిర్కార్ వినయ్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కామారెడ్డి జిల్లా కేంద్రాన్ని విద్యాహబ్‌గా మార్చాలని ఏళ్ల నుంచి కోరుతున్నా పాలకులు స్పందించకపోవడం అన్యాయమన్నారు. జిల్లాకు కేటాయించిన యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాన్ని కామారెడ్డిలోనే ఏర్పాటు చేయాలన్నారు. కామారెడ్డి పురపాలికలోనూ సమస్యలపై కౌన్సిలర్లు అర్థవంతమైన చర్చ సాగించడం లేదన్నారు. నాయకులు రవికాంత్, చందు, రాజు, ఈశ్వర్, పాషా తదితరులున్నారు.

ఈ దారి ఎక్కడికో?



జాతీయరహదారిపై ఏర్పాటు చేసే బోర్డులపై ఊర్ల పేర్లు, సర్వీస్ రోడ్లు ఎక్కడి వరకు వెళ్తాయో వివరాలు నమోదు చేయాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులకు బోర్డులపై సమాచారం చూసి ప్రయాణం చేసే వెసులుబాటు ఉంటుంది. కానీ కామారెడ్డి శివారులోని టేక్రియాల్ వద్ద సర్వీస్ రోడ్డుపై వివరాలు లేని బోర్డు చిత్రాన్ని ఏర్పాటు చేశారు. ఊరి వివరాలు లేక సమస్యగా మారింది. **- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం**

గుంతల పూడ్చివేత



ఉప్పరిపల్లి నుంచి బీబీపేట వైపునకు వెళ్లే బీటీ రోడ్డుపై గుంతలతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని ఈనాడులో ఈ నెల 29న 'శాశ్వత పరిష్కారం ఏది' శీర్షికన సమస్య చిత్రం ప్రచురితమైంది. స్పందించిన ఉప్పరిపల్లి గ్రామపంచాయతీవారు భారీ గుంతలను కంకర, సిమెంట్‌తో పూడ్చారు. **- న్యూస్‌టుడే, బీబీపేట**

బంజారాల సంస్కృతికి ప్రతీక.. తీజ్

ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే: బంజారా ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ ఉత్సవం అని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో ఆదివారం జరిగిన తీజ్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆచార, సంప్రదాయాలను భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లింగారెడ్డిపేట్ కూడలి నుంచి పెద్దచెరువు వరకు గోధుమ బుట్టలతో బంజారా మహిళలు నృత్యం చేస్తూ నిర్వహించిన ర్యాలీ ఆకట్టుకుంది. అనంతరం చెరువులో బుట్టలను నిమజ్జనం చేశారు. ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట్ మండలాల తీజ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



గోధుమ బుట్టలతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, గిరిజన చిన్నారులు

సంప్రదాయాలను కాపాడాలి..

లింగంపేట, న్యూస్‌టుడే: ఆచార, సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. లింగంపేట మండల కేంద్రంలో ఆదివారం జరిగిన తీజ్ పండగలో ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. పండగలు ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయన్నారు. గిరిజన మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి గోధుమ బుట్టలతో నిర్వహించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. టీఆర్ఎస్ ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సంపత్‌గౌడ్, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకుల పాల్గొన్నారు.



లింగంపేటలో తీజ్ వేడుకల్లో గిరిజన మహిళలు

కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ వార్డు కమిటీల నియామకం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కామారెడ్డి పట్టణ కాంగ్రెస్ వార్డు కమిటీలను ఆదివారం నియమించారు. 10వ వార్డు కమిటీ అధ్యక్షుడిగా ఉరుదొండ ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా మరకంటి స్వామి, నీలం రవి, కార్యదర్శిగా లద్దూరి నాగార్జున, కోశాధికారిగా అరిఫ్ నియమితులయ్యారు. సలహాదారులుగా చెట్కూరి గంగారం, ఉరుదొండ నరేష్, లద్దూరి లక్ష్మీపతి యాదవ్, రాజయ్య, ఎజాజ్, నాగళ్ల రాజయ్య, సాకలి నవీన్‌లను నియమించారు. 12వ వార్డు అధ్యక్షుడిగా ధర్పల్లి మధుసూదన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పార్థసారథి, కార్యదర్శిగా నీలం వెంకటి, కోశాధికారిగా గోలి సుధాకర్, సలహాదారుగా ఉరుదొండ నర్సింలు నియమితులయ్యారు. 35వ వార్డు అధ్యక్షుడిగా చంద్రకాంత్‌రావు, ఉపాధ్యక్షులుగా రసూల్, జోసెఫ్, కార్యదర్శిగా ముజ్జు, యువజన విభాగం అధ్యక్షుడిగా నరేందర్, సలహాదారుగా సతీష్‌రెడ్డి నియమితులయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను మహమ్మద్ ఇలియాజ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్, విండో ఛైర్మన్ గూడెం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు పండ్ల రాజు, పార్టీ మండల అధ్యక్షులు రాజాగౌడ్, శ్రీనివాస్, నిట్టువెంకట్రావ్, గుడుగులు శ్రీనివాస్ అభినందించి సన్మానించారు.

రఘు కుటుంబానికి ఆర్థికసాయం

బాన్సువాడ, న్యూస్‌టుడే: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన బాన్సువాడ పట్టణానికి చెందిన కానిస్టేబుల్ రఘు కుటుంబానికి పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి రూ.2.96 లక్షల ఆర్థికసాయం ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2012 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ రఘు గాంధారి ఠాణాలో విధులు నిర్వహిస్తుండగా మరణించారని తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాతో పాటు రంగారెడ్డికి జిల్లాకు చెందిన పోలీసు మిత్రులందరూ కలిసి రూ.2.96 లక్షలు సేకరించామన్నారు. ఈ మొత్తం డబ్బులో రఘు ఇద్దరు కుమార్తెలకు తలా రూ.లక్ష చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్, మిగతా రూ.96వేలు కుటుంబ అవసరాలకు అందజేశామన్నారు. రఘు సతీమణికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం వచ్చే విధంగా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రఘు, రాజేశ్వర్‌రెడ్డి, శంకర్, ప్రవీణ్, సతీష్, బాశెట్టి తదితరులున్నారు.



కానిస్టేబుల్ రఘు కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న రంజిత్‌రెడ్డి

మాజీ సర్పంచి కుటుంబానికి..

బాన్సువాడ, వర్ని న్యూస్‌టుడే: వర్ని మండలం తగిలేపల్లి మాజీ సర్పంచి వెంకన్న కుటుంబానికి బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి రూ.లక్ష ఆర్థికసాయాన్ని బాన్సువాడ పట్టణంలోని తన నివాసంలో ఆదివారం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేతో పాటు నిజామాబాద్ డీసీసీబీ మాజీ అధ్యక్షుడు పోచారం భాస్కర్‌రెడ్డి, వర్ని మండల నాయకులున్నారు.



వెంకన్న కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న ఎమ్మెల్యే పోచారం

ఎమ్మెల్యే పరామర్శ..

బాన్సువాడ: పట్టణంలోని సిగ్నల్ వద్ద మృతి చెందిన చిన్నారి జైనబ్ ఫాతిమా కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం రాత్రి పరామర్శించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు, పుర అధికారులకు ఆదేశించారు. తాడ్కోల్ చౌరస్తాలో ఆక్రమణలు తొలగించాలని సూచించారు. వెంట నాయకులు ఎజాస్, వాహబ్, ఖాలెక్, గౌస్, హకీం, రఫీ తదితరులున్నారు.

లింగంపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని మెంగారం గ్రామ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తంత్రి గణేష్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఆదివారం పరామర్శించారు. మెంగారం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే.. బాధితుడి కుటుంబసభ్యులను ఓదార్చి వారికి ధైర్యం చెప్పారు. వెంట కాంగ్రెస్ నాయకులు నారాగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నస్రుల్లాబాద్: హాజీపూర్ తండాలో భారాస సీనియర్ నాయకుడు బోడ రాంచందర్ పెద్దమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న బాన్సువాడ నియోజకవర్గ భారాస నాయకులు దుద్దాల అంజిరెడ్డి, మోరల్ శ్రీనివాస్‌రావు హాజీపూర్ తండాకు వచ్చి ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మోగవత్ భాస్కర్, అంబర్‌సింగ్, విఠల్, భీమా, సురేష్ తదితరులు ఉన్నారు.